మహేశ్వరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- మంత్రి సబితారెడ్డి
- మన్సాన్‌పల్లి – కోళ్లపడకల్ రోడ్డుకు రూ. 15.20 కోట్లు మంజూరు
- కృతజ్ఞతలు తెలిపిన ఎంపీపీ రఘుమారెడ్డి, బీఆర్ఎస్ నేతలు


మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీపీ రఘుమారెడ్డి తదితరులు

మహేశ్వరం: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మన్సాన్‌పల్లి – కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాలను కలిపే బీటీ డబుల్ రోడ్డు పనులకు మంత్రి రూ. 15.20 కోట్లు మంజూరు చేశారు. దీంతో గురువారం ఎంపీపీ కే రఘుమారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు మంత్రిని నగరంలోని ఆమె నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరంలో ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. మహేశ్వరం గేటు నుంచి మహేశ్వరం వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. శ్రీశైలం జాతీయ రహదారి తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం పట్టణం వరకు రూ. 14 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, తండాల రోడ్లకు రూ. 9.41 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాగారం – కోళ్లపడకల్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులకు రూ. 15 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతానికి పలు పరిశ్రమలు వచ్చాయని, భవిష్యత్తులో మరిన్ని భారీ పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పార్టీ సీనియర్ నాయకుడు కే ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కే రాకేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాదయ్య తదితరులు ఉన్నారు.

ఓబీసీల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహ


పల్లె పల్లెకూ ఓబీసీ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: ఓబీసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీజేపీ మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహ అన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. లక్ష్మణ్ పిలుపు మేరకు గురువారం మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు తుమ్మల రమేష్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ కమలానగర్‌లో పల్లె పల్లెకూ ఓబీసీ – ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఓబీసీల సంక్షేమం, సాధికారత, రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 2017లో ఓబీసీ క్రిమిలేయర్ ఆదాయాన్ని రూ. 6 లక్షల నుంచి 8 లక్షలకు పెంచిందన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలకు స్థానం కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర నాయకులు బీ రాములు, సీ రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు పీ భిక్షపతిచారి, మీర్‌పేట ఉపాధ్యక్షులు సోమేశ్వర్, జీ మధు, కార్పొరేటర్లు కే గోవర్ధన్‌రెడ్డి, భీంరాజ్, నాయకులు యాదగిరి యాదవ్, నవీన్, నాగరాజు, విక్కీసాగర్, నగేష్ పాల్గొన్నారు.

డంప్ యార్డ్ పరిశీలన

ఆమనగల్లు: ఎన్ఆర్ఈజీఎస్ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలం నర్సాయిపల్లి గ్రామంలో గురువారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం, నర్సరీ, శ్మశానవాటిక, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈజీఎస్ కూలీలతో మాట్లాడారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బారి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది తదితరులు

పహాడీషరీఫ్: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నియమ నిష్టలతో గడపాలని జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అన్నారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో షాహిన్‌నగర్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని కౌన్సిలర్లు, నాయకులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదుల పరిసరాల్లో అసౌకర్యాలు కలగకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అహ్మద్ కసాది, హామెద్ అజీజ్, దస్తగిర్, జాఫర్ బామ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ బీ హేమలత అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని 9వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం హేమలత మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించడం తోపాటు, వార్డును దశల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమౌని రాజు, నాయకులు సుధాకర్, కృష్ణ, ఆంజనేయులు, రాజు, కృష్ణ, రాకేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

16న మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష

మహేశ్వరం: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 16న పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బీ ధనుంజయ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు, అలాగే 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీల భర్తీకి పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను WWW.teanfanamr.cff.gov.in వైబ్ సైట్‌లో డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ఠకు రండి

బీజేపీ నేత అందెలను ఆహ్వానించిన నిర్వాహకులు


శ్రీరాములుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లిలో మే ఒకటిన నిర్వహించనున్న కాటమయ్య స్వామి, సురమాంబ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని నిర్వాహకులు ఈ నర్సింగ్‌గౌడ్, ఈ రాజేష్‌గౌడ్ బీజేపీ నేత అందెల శ్రీరాములు యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. గురువారం కౌన్సిలర్ బీ యాదగిరితో కలిసి శ్రీరాములుకు ఆహ్వాన పత్రిక ఇచ్చారు. మే ఒకటి నుంచి 4వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. 3న విగ్రహాల ప్రతిష్ఠాపన, 4న బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్ గౌడ్, జీ మల్లేష్, బాలశివుడు గౌడ్, జీ శ్రీకాంత్, జీ మురళీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ


రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఆసిఫ్ అలీ

కడ్తాల్: రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ ఆధ్వర్యంలో.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లిం సోదరులకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని 76 మసీదుల్లో మౌజన్, ఇమామ్, హాఫేజ్‌కు రంజాన్ కిట్లను అందించామన్నారు. రంజాన్ కిట్లలో దుస్తులతో పాటు, టోపీలు, అత్తరు, సుర్మ, తజ్బీ, ముహెరుమా తదితర వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే కడ్తాల్‌లోని ముస్లిం సోదరులకు మిత్రమండలి ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను అందిస్తామన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు బోసుపల్లి వీరేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్పీ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త

ప్రజలకు సీఐ ఉపేందర్ సలహాలు, సూచనలు



ఆమనగల్లు: నేరాలు అదుపుచేయడానికి పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆమనగల్లు సీఐ ఉపేందర్ కోరారు. ఆమనగల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ ఉపేందర్ మాట్లాడారు. వేసవికాలంలో దొంగతనాలు నివారించడానికి సైబరాబాద్ పోలీసులు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు సీఐ చెప్పారు. వేసవి సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని లేదంటే ఇంట్లో రహస్య ప్రదేశంలో పెట్టాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం గల తాళం అమర్చుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. వాహనాలను ఇంట్లో పార్కింగ్ చేసి తాళాలు వేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్తే సోషల్ మీడియాలో ఆ విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం సరైంది కాదని ఆయన చెప్పారు. నమ్మకమైన ఇరుగుపొరుగువారికి ఇంట్లో మీరు లేని సమయంలో ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పండి. అత్యవసర సమయంలో 100కి డయల్ చేయండి.

జల్‌పల్లి అభివృద్ధి కనిపించడం లేదా?

- బీజేపీ నేతలపై బీఆర్ఎస్ ఫైర్
- అసత్య ఆరోపణలు చేస్తే సహించమని హెచ్చరిక


జల్‌పల్లిలో జరిగిన అభివృద్ధి పనుల జాబితాను చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులు బీజేపీ నాయకులకు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ నేతల ప్రశ్నించారు. గురువారం జల్‌పల్లిలో బీఆర్ఎస్ నేతలు కృష్ణారెడ్డి, బామ్, సయ్యద్ యూసుఫ్ పటేల్, జనార్దన్ మాట్లాడారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్, మరి కొందరు మున్సిపల్ అభివృద్ధిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ బడ్జెట్ ఆమోదం కాకుండానే మంత్రి సబితారెడ్డి చొరవతో రూ. 43.47 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మరో 100 కోట్లతో జలమండలి పనులు కొనసాగుతున్నాయన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని ఫొటో లేదని అధికారులను దబాయించిన అందెల.. రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాలయాల్లో సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఫొటోలు ఎందుకు పెట్టలేదో చెప్పాలన్నారు. ప్రశాంతంగా ఉన్న జల్‌పల్లిలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. వారి ఆటలు సాగనివ్వమన్నారు. జల్‌పల్లి అభివృద్ధికి స్థానిక బీజేపీ కౌన్సిలర్ అడ్డుగా మారారని ఆరోపించారు. పైప్‌లైన్ సమస్యను పరిష్కరిస్తామంటూ స్థానికుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. మున్సిపాలిటీలోని పాఠశాలలను దశల వారీగా అప్‌గ్రేడ్ చేస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కావాలనే అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకొని చూస్తే ఈ ప్రాంత అభివృద్ధి కనిపిస్తుందని వారు ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు షేక్ జహంగీర్, పీ శంకర్, లక్ష్మీనారాయణ, యూ నిరంజన్, షేక్ అఫ్జల్, అర్జున్, సుభాస్, నగేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం భవన నిర్మాణానికి కృషి

ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి


నిధుల మంజూరు కాపీని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న గౌడ సంఘం భవన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషిచేస్తానని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గౌడ సంఘం సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. గౌడ సంఘ భవన నిర్మాణం నిధులు లేక అసంపూర్తిగా ఉందని.. భవన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకరించాలని ఆ సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గౌడ సంఘం భవన నిర్మాణం కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.2లక్షల ప్రొసీడింగ్‌ను ఆ సంఘం నాయకులకు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్ పాండునాయక్, గౌడసంఘం నాయకులు యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కందుకూరు
మోస్తరు వర్షం

కందుకూరు: మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో కొద్ది రోజులుగా ఉక్కపోతతో అవస్థలు పడుతున్న జనాలకు వర్షంతో ఊరట లభించినట్లయింది.

పడకల్‌లో
ఉచిత వైద్య శిబిరం

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌లో ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేశవరెడ్డి సూచించారు. కాగా శిబిరంలో 396 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీలు జోగు రమేష్, రఘునాయక్, ఉప సర్పంచ్ యాదమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, జగ్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కడ్తాల్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం రాజేశ్వరి సూచించారు. మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ 2.0లో భాగంగా గురువారం 'ఆర్థిక అక్షరాస్యత–డిజిటల్ లావాదేవీలు' అనేం అంశంపై స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో మెజార్టీగా.. డిజిటల్ లావాదేవీల ద్వారా నగదు జమచేయడం, బదిలీ చేయడం, బీమా సదుపాయాలు, చెల్లింపులు, బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన గురించి వివరించారు. అంతకు ముందు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాంధీ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్ ఉన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరపాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువజన సంఘం నాయకులు

మీర్‌పేట: అంబేడ్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని మీర్‌పేట అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డీ బాబు మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి రోజున ఆయన విగ్రహాన్ని పూలతో అలంకరించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే పార్టీలు, కుల, మతాలకు అతీతంగా నాయకులు, సంఘాల వారిని ఆహ్వానించి ఘనంగా జయంతి వేడుకలు జరపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుధాకర్, ఆర్ జాన్, ఎల్ నర్సింహ, డీ బాలరాజు, నవీన్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

దిమ్మె కూల్చివేతపై ఆందోళన


పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ దిమ్మె కూల్చివేతపై గ్రామస్తులు గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని ఓ వర్గానికి చెందిన వారు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి దిమ్మెను నిర్మించారు. అయితే ఈ దిమ్మెను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చేశారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి రోజు ఆయన విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తుండగా.. కావాలనే కొందరు దిమ్మెను కూల్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ కాలె సంతోషను సంప్రదించగా అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ విషయంలో గ్రామంలోని మాదిగ, మాల వర్గాల్లో వివాదం తలెత్తినట్లు.. త్వరలో గ్రామస్తులతో సమావేశమై గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠస్తామని ఆమె తెలిపారు. సర్పంచ్ హామీతో ఆందోళనకారులు శాంతించారు.

ముదురుతున్న ఎండలు...
అడుగంటుతున్న బోరుబావులు

- లోప్రెషర్‌లో జలమండలి నీటిసరఫరా
- కాలనీల్లో నీటి కష్టాలు షురూ..


కాలనీల్లో వెలసిన బహుళ అంతస్తుల భవనం

వనస్థలిపురం: రోజు రోజుకూ ఎండలు ముదురుతుండటంతో నీటి కష్టాలు అప్పుడే మొదలవుతున్నాయి. కాలనీల్లో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటంతో నీటి వాడకం పెరిగి బోరు బావులు అడుగంటుతున్నాయి. జలమండలి నీటి సరఫరాలో కూడా ప్రెషర్ తగ్గడంతో సరిపడా నీరు అందక కాలనీల ప్రజలు జలమండలి, ప్రైవేట్ నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఏప్రిల్‌లోనే ఇలావుంటే వచ్చే మే నెలలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకం...

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు తదితర డివిజన్లలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో సహజంగానే నీటి వాడకం ఎక్కువై విచ్చలవిడిగా బోరు బావులు తవ్వుతున్నారు. బడా నిర్మాణ సంస్థలు తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1500 నుంచి 2000కు పైచిలుకు ఫీట్ల లోతుగా బోరులను తవ్వి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీంతో కాలనీల్లో తక్కువ లోతులో ఉన్న బోరు బావులు ఎండిపోతున్నాయి.

వాల్టా చట్టం అమలు ఎక్కడా...

కొత్తగా వ్యక్తిగత బోర్లు, బావుల తవ్వకాలపై ఆంక్షలు వర్తిస్తాయి. భూగర్భ జలాల పరిరక్షణకు వాల్టా (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) చట్టం అమలులో ఉంది. బోరు వేయడానికి 15 రోజుల ముందు సంబంధిత యజమాని భూగర్భ జలవనరుల అధికారులకు సమాచారం అందజేసి, వారి నుంచి అనుమతి పొందాలి. బోర్‌వెల్ తవ్వే యంత్రాల యజమానులు విధిగా తమ పేర్లను సంబంధిత అధికారుల వద్ద నమోదు చేసుకుని తవ్వకాలకు అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమి లేకుండా కాలనీల్లో విచక్షణారహితంగా బోరు బావులను తవ్వేస్తున్నారు.

తప్పనిసరిగా నీటి కొనుగోలు

కాలనీలలో జలమండలి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తోంది. ఇంతకు ముందు రెండు గంటల పాటు సరఫరా ఉండగా, ప్రస్తుతం గంటసేపు మాత్రమే సరఫరా జరుగుతోంది. దీనికితోడు పలు ప్రాంతాలలో లోప్రెషర్‌తో సరఫరా జరుగుతుండటంతో సరిపోనూ నీరు రావడం లేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఉన్న బోర్లు అడుగంటిపోవడంతో గత్యంతరంలేక జలమండలి నుంచి 5000 వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంకర్ రూ. 500 లకు, ప్రైవేట్ ట్యాంకర్లకు రూ. 650 మొదలుకొని రూ. 800 వరకు వెచ్చించి నీటిని తెప్పించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

నీటి పొదుపే మేలు...

నీటి ఎద్దడి నివారణకు ఉన్న జలాలను పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భజల రక్షణకు ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు, పలు సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కాగా జలమండలి ఆధ్వర్యంలో నీటి సరఫరా చేసే సమయంలో పలు ప్రాంతాలలో లీకేజీలతో విలువైన నీరు వృథాగా రోడ్లపాలు అవుతోందని, లీకేజీలను అరికట్టడానికి జలమండలి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే లోప్రెషర్ సమస్యను అరికట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

> **అడ్డగోలు తవ్వకాలతోనే నీటి సమస్యలు**
>
> కాలనీల్లో బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలతో నిర్మాణదారులు వేలాది ఫీట్ల లోతులో బోరుబావులను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో చిన్నా, చితక బోరుబావులు ఎండిపోతున్నాయి. జలమండలి నీటిసరఫరా కూడా లోప్రెషర్‌లో వస్తోంది. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ ట్యాంకర్ల నుంచి నీరు తెప్పించుకోవాల్సి వస్తోంది.
>
> – జి.రామకృష్ణ, విశ్వేశ్వరాయ ఇంజినీర్స్‌కాలనీ, హస్తినాపురం

రచయిత్రి శ్రీవల్లీ రాధికకు ఓయూ డాక్టరేట్

వనస్థలిపురం: ప్రముఖ రచయిత్రి, వనస్థలిపురం కమలానగర్ కాలనీకి చెందిన టి.శ్రీవల్లీ రాధికకు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'తెలుగు సాహిత్యం–భక్తిరసం' అన్న అంశంపై శ్రీవల్లీ రాధిక ప్రొఫెసర్ డాక్టర్ పి.వారిజారాణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. ఎంఏ (తెలుగు) చేసిన శ్రీవల్లీ రాధిక గత 20 సంవత్సరాలుగా పలు కథలను, నవలలను రచించారు. ఆమె రాసిన సాహిత్య విమర్శనా వ్యాసాలు, కవితా సంపుటాలు, పద్య కవిత్వం, బాల సాహిత్యం పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. గేయ రచనలు ఆకాశవాణిలో లలిత గీతాలుగా ప్రసారమయ్యాయి. ఆమె రచించిన కథలు, కథా సంపుటికిగానూ పలు సంస్థలు ఉత్తమ కథా రచయిత్రి పురస్కారాలు అందజేశాయి.

నాసిరకం పనులపై కార్పొరేటర్ ఆగ్రహం

పనులు నిలిపివేయాలని ఆదేశం


నిర్మాణంలో వాడుతున్న డస్ట్‌ను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పార్కు అభివృద్ధి పనులు నాసిరకంగా చేపట్టడంపై బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హెచ్ఎండీఏ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డినగర్ ఫేజ్–3లోని రూ.1.4 కోట్లతో జరుగుతున్న పార్కు పనులను గురువారం హెచ్ఎండీఏ అధికారులు డీఈ జగన్మోహన్‌రావు, ఏఈ జీవన్‌రెడ్డిలతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కు ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యతను పట్టించుకోవడం లేదని, టెండర్ నిబంధనల ప్రకారం పనులు చేయడం లేదని ఆరోపించారు. ఇసుకతో ప్రహరీ నిర్మించాల్సి ఉండగా సిమెంట్ వాడకుండా కేవలం డస్ట్‌తో నిర్మాణం చేపట్టడంపై ఆయన మండిపడ్డారు. ఇలా చేస్తే ప్రజల సొమ్ము వృథా కావడం తప్ప ఉపయోగం ఉండదన్నారు. పార్కు గోడ పక్కన నుంచి పైకాలనీల నుంచి వచ్చే వరద కాలువ ఉందని, వర్షం పడితే భారీగా నీటి ప్రవాహం ఉంటుందని, నాసిరకంగా నిర్మించిన గోడ కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వెంటనే పనులను నిలిపివేయాలని, నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్ట్ టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్, సురేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేస్తాం: ఈఈ పద్మ

పార్కు పనులు నాసిరకం ఉన్నాయని అధికారులు తేల్చడంతో ఆ పనులను నిలిపివేసి, ఇప్పటి వరకూ జరిగిన నిర్మాణాన్ని కూల్చివేస్తామని హెచ్ఎండీఏ ఈఈ పద్మ తెలిపారు. నాసిరకంగా పనులు చేపడుతున్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని 'సాక్షి' ప్రశ్నించగా సమాధానం దాటవేశారు.